www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 2 సెప్టెంబరు 2024
5
చిత్తూరు

వాతావరణ హెచ్చరికలతో
నేడు విద్యా సంస్థలకు సెలవు : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: భారీ వర్షసూచనలున్నట్లు వాతా వరణ శాఖ హెచ్చరికలతో సోమవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యా సంస్థలకు, జూనియర్ కళాశాలలకు సెలవు ప్రకటించారు. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, జూనియర్ కళాశాలకు ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వ్యవసాయం..పెనుభారం!

- ప్రతికూల వాతావరణం.. పంటలకు తెగుళ్లు
- రైతులకు అందని రూ.20 వేలు సాయం
- తొలకరి మొదలై మూడు నెలలు పైమాటే
- ఇన్ పుట్ సబ్సిడీ కోసం రైతుల నిరీక్షణ

ప్రజాశక్తి -వెదురుకుప్పం: ఖరీఫ్ ప్రారంభం నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. వ్యవసాయం పెనుభారంగా మారుతోంది..వర్షాలు కురుస్తున్నా యి.. పంట సాగు చేసేందుకు రైతు కుటుంబాలు ముందుకు రావడంలేదు.. ఈ ఖరీఫ్ సీజన్‌లో కొంత మంది రైతులు వరి, వేరుశనగ, కంది, అలసంద, పెసలు పంటలను సాగు చేశారు. వాతావరణంలో మార్పులు వల్ల పంటలో తెగుళ్ల ఎక్కువగా వసు న్నాయి. నివారణ చర్యలో భాగంగా రైతులకు పెట్టు బడి తడిసి మోపుడు అవుతోంది. రైతులకు రూ. 20 వేలు అందిస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఆచరణకు నోచుకోలేదు. దీంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

అప్పు చేసి సాగు..

అప్పులు చేసి రైతులు వ్యవసాయం సాగు చేసినా ఇంత వరకు ఈ క్రాప్ నమోదు చేయక పోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. అనుకోని విపత్తు పరిస్థితి సంభవిస్తే ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం అందుతుందో లేదో అని ఆందోళ న చెందుతున్నారు. గత ప్రభుత్వం ఏటా పంట సాగు సమయంలోనే వ్యవసాయ అధికారులు పంట పొలాల వద్దకు వచ్చి ఈ క్రాప్ నమోదు చేసేవారు. దీంతో ప్రభుత్వం నుంచి అందాల్సిన నష్ట పరిహారం సకాలంలో అందేది. కూటమి ప్రభుత్వం లో ఈ పరిస్థితి లేదు. అప్పులు చేసి రైతన్నలు పంటలను సాగు చేస్తున్నారు.

పొలంలో వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతు రాజయ్య

అందని అన్నదాత సుఖీభవ సాయం

రైతన్నలకు ఏడాదికి రూ.20 వేలు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకు ఆ మాట నెరవేరలేదు. తొలకరి సాగు మొదలై మూడు నెలలు పైగానే అవుతోంది. సాయం అందలేదు. దీనిపై కూటమి ప్రభుత్వం నోరు మెదపలేదు.. పీఎం కిసాన్ తొలి విడత జూన్ నెలలోనే కేంద్ర ప్రభుత్వం రూ.2వేలు చొప్పున రైతు ఖాతాలకు జమ చేయగా, అన్నదాత సుఖీభవ సాయం విడుదలపై రాష్ట్ర ప్రభుత్వం నోరు విప్పడం లేదు. దీంతో రైతులు పెట్టుబడుల కోసం వడ్డీ వ్యాపారు లను ఆశ్రయిస్తున్నారు.. కూటమి ప్రభుత్వం వెంటనే ఆలోచించి రైతు లను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

సకాలంలో అందించాలి

కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం సాయం చెప్పిన మాట ప్రకారం సకాలంలో అందించాలి. రైతు కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలి. రైతు నష్టపోకుండా చూడాలి. సమయం దాటిన తర్వాత సహాయం ఇచ్చినా ఉపయోగం ఉండదు.

- జాన్ సుందరం, తూగుండ్రం గ్రామం, గంగాధర నెల్లూరు మండలం.

సకాలంలో ఇస్తే విత్తనాలకు ఉపయోగం

ప్రభుత్వ సాయం సకాలంలో ఇస్తే విత్తనాలకు ఉపయోగపడు తుంది.. కూటమి ప్రభుత్వం సకాలంలో అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల అకౌంట్లో వేస్తే విత్తనాలకు, ఎరువులకు, క్రిమిసంహార మందులకు సరిపోతుంది. రైతులను ఆదుకున్నట్లు ఉంటుంది. ప్రభుత్వం స్పందించాలి. ఆలోచించాలి..

- గుణశేఖర్ నాయుడు, పిల్లి గుండ్లపల్లి గ్రామం, కటిక పల్లి గ్రామపంచాయతీ, ఎస్ఆర్ పురం మండలం.

రైతులకు న్యాయం చేయాలి..

కూటమి ప్రభుత్వం, ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ డబ్బులు వారి వారి అకౌంట్లోకి జమ చేసి న్యాయం చేయాలి. రైతులు వ్యవసాయ పనులకు పెట్టుబడును పెట్టే సరైన సమయం. ఇప్పుడే రైతులను ఆదుకోవాలి. ప్రభుత్వం ఒకసారి ఆలోచించాలి.

- లోకనాథం , రైతు, దాసరి నెత్తం గ్రామం, ముక్కరవానిపల్లి పంచాయతీ, కార్వేటినగరం మండలం.

చిట్స్ కొంప ముంచుతాయ్ జాగ్రత్త: ఎస్‌పి

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్:

అనుమతులు రిజిస్ట్రేషన్ లేని చిట్స్ (చిట్టీలు) కొంపముంచు తాయని తమ కుటుంబ అవసరాలు, పిల్లల చదువులు, ఆరోగ్య ఖర్చులు , ఇతర ఆర్థిక అవసరాల కోసం కష్టపడి సంపాదించిన డబ్బును చిట్స్ వంటి రిజిస్ట్రేషన్ లేని, నియంత్రణ లేకపోయిన వ్యవస్థల్లో పెట్టకుండా ఉండాలని ఎస్‌పి మణికంఠ చందోలు హెచ్చరించారు. అధిక లాభాల ఆశ చూపిస్తూ చీటీల పేరుతో మోసాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ఇలాంటి పథకాల్లో చేరితే వారు తమ సంపాదనను కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇలాంటి మోసాలకు గురైన ప్రజలు ఆర్థికంగా భారీ నష్టాన్ని చవిచూసి, వారి కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కూరుకు పోయే ప్రమాదం ఉందని, దీని వల్ల వారిలో మానసిక ఒత్తిడులు, బాధలు పెరుగుతా యని చెప్పారు. అందువల్ల, ప్రజలు ఎప్పటి కప్పుడు తగిన శ్రద్ధ తీసుకొని, రిజిస్ట్రేషన్, ప్రభుత్వం ద్వారా నియంత్రణ ఉన్న చీటి సంస్థ లలోనే సభ్యత్వం తీసుకోవాలని, ఎవరికీ తమ కష్టార్జిత డబ్బును ఇచ్చేముందు పూర్తిగా పరిశీలించాల్సిన అవసరం వుందని ఎస్‌పి సూచించారు.

మరమ్మతులకు నోచుకోని క్వార్టర్స్

- 30 ఏళ్లుపై బడిన భవనం
- ఉరుస్తున్న భవనాలు
- విష సర్పాలకు నిలయం

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు:

గంగాధర నెల్లూరులో ప్రభుత్వ క్వార్టర్స్ భవనాలు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 30 ఏళ్ల క్రితం పంచాయతీ సమితి కేంద్రంగా ఉండేది. అల్లి ఎల్లమ్మ గుడి వెనుక భాగంలో అప్పట్లో బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు, పంచాయతీ విస్తరణ అధికారికి వేరువేరుగా ప్రభుత్వ క్వార్టర్స్ భవనాలు నిర్మించారు. ఈ రెండు భవనాల్లో ఒకటి ఏళ్ల తరబడిగా నిరుపయోగంగా మారగా, ఆ భవనం వర్షాలకు ఉరుస్తూ ఏకంగా భవనంపై చిన్న చిన్న మొక్కలు మొలిచాయి. ఆ చుట్టుపక్కల గుబురు గుబురుగా పిచ్చి మొక్కలు పెరిగిపోయి, విష సర్పాలకు నిలయంగా మారింది. మరొక భవనంలో తాత్కాలికంగా రైతు భరోసా కేంద్రానికి సంబంధించి పరికరాలు, ఇతర ఇతర సామగ్రిని భద్రపరుచు కునేందుకు వినియోగిస్తున్నారు. ఇందులో కొంత భాగం ఉద్యాన శాఖ కార్యా లయంగా నాలుగేళ్లకు పైగా ఉపయోగపడుతోంది. ఈ భవనం చుట్టూ పక్కల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించి కొత్తవి నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ క్వార్టర్సు భవనాలు

యథేచ్ఛగా నాటుసారా తయారీ, విక్రయం

- గ్రామాల్లో ఏరులై పారుతున్న సారా
- అధికార పార్టీ అండ, బట్టీల నిర్వాహకులపై నామమాత్రపు కేసులు

సారా తయారీ, అమ్మకం నిషేధం ఉన్నా....ఇవేవి పట్టనట్లు యథేచ్ఛగా సారా తయారీ.. అమ్మకం జరుగుతున్నాయి. గత ప్రభుత్వం నాటుసారా తయారీ దారులపై ఉక్కుపాదం మోపింది. దీంతో నాటుసారా తయారు చేయాలన్నా, విక్రయిం చాలన్న గుండెల్లో వణుకు పుట్టేది. అయితే కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టకా తిరిగి నాటు సారాకు రెక్కలొచ్చాయి. గతంలో ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో రహస్యంగా ఎప్పుడో ఒకసారి బట్టీలను ఏర్పాటు చేసి నాటుసారా తయారు చేసేవారు. అయితే ప్రస్తుతం సారాకు డిమాండ్ అధికంగా ఉండటంతో తయారీ కేంద్రాలకు పలు గ్రామాలు అడ్డాగా మారాయి. కొన్ని గ్రామాల్లో 10కి పైగా కేంద్రాలు ఉన్నాయంటే తయారీ ఏ స్థాయిలో జరుగుతోందో తెలుసుకోవచ్చు. కొన్ని గ్రామాల్లో సారా తయారీ ఓ కుటీర పరిశ్రమగా మారింది. ఉపాధితో పాటు రూ.లక్షలు తెచ్చిపెడుతుండటంతో ఎక్కువ మంది అక్రమ మార్గాల బాట పడుతూ సారా తయారీ వైపు ఆసక్తి చూపుతున్నారు. వారికి అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉండటంతో పోలీసులు, సెబ్ అధికారులు తూతూమంత్రంగా దాడులు, కేసులకు పరిమితమవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. సారాతో.. తయారీదారులు, వారికి అండగా ఉంటోన్న అధికార పార్టీ నేతలు, అడ్డుకోవాల్సిన అధికారులు రూ.లక్షలు సంపాదిస్తుండగా.. తాగిన వారు రోగాల బారిన పడుతున్నారు.

ప్రజాశక్తి -చిత్తూరు డెస్క్ : విజయపురం మండలం ఆంధ్ర, తమిళనాడు సరిహద్దు ప్రాంతానికి ఆనుకొని వుంది. ఇక్కడ తయారు చేసే సారాకు తమిళనాడులో మంచి గిరాకీ ఉంటుంది. దీన్ని అవకాశంగా తీసుకొని గ్రామాల్లో నాటు సారాను కుటీర పరిశ్రమలా మలుచుకున్నారు. తక్కువ పెట్టుబడి, కొంచెం రిస్క్, ఎక్కువ లాభాలు ఉండటంతో ఎక్కువ మంది నాటు సారా తయారీ వైపు మొగ్గుచూపుతున్నారు. పనులు లేక కొందరు.. ఉన్నా చాలీచాలనీ కూలీలు వస్తుండటంతో మరికొందరు.. సారా తయారీ, రవాణా, అమ్మకం చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోలీసులు, సెబ్ అధికారుల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా అధికార పార్టీ నేతలకు అడిగినంత ముట్టజెబుతున్నారు. దీంతో పోలీసులు, సెబ్ అధికారులు తూతూమంత్రంగా దాడులు.. నామమాత్రపు కేసులతో సరిపెడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సారా తయారు చేస్తున్న ఫిర్యాదులు వస్తున్నా వారికి అధికార పార్టీ అండ ఉండటంతో అధికారులు దాడులు చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. మరికొందరు అధికారులు ఇదే అవకాశంగా తయారీదారుల నుంచి ముడుపులు తీసుకుంటూ ఉదాసీనంగా ఉంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఎవరైనా నాటుసారా తయారీ, అమ్మకం చేస్తూ పట్టుబడితే అధికార పార్టీ నేతలు సంబంధిత అధికారులపై ఒత్తిడి తెచ్చి విడిపిస్తుండటంతో నాటుసారా తయారీ మూడు పువ్వులు ఆరు కాయలుగా వెదజల్లుతున్నాయి.

ఐదుగురు సూత్రదారులు!

విజయపురం మండలంలో నాటు సారా తయారీ పెరగడానికి ఆ ఐదుగురు సూత్రదారులుగా కనిపిస్తున్నారు. విజయపురం దళితావాడలో ముగ్గురు, కేవీపురంలో ఇద్దరు వీరికితో పాటు తమిళనాడు చెందిన వ్యక్తి కావడం విశేషం. వీరు కనుసైగలోనే నాటుసారా జరుగుతున్నాయి. వీరు చెప్పిందే శాసంగా నాటుసారా తయారీ సాగుతోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. నాటుసారా తయారీకి ప్రధానమైంది బెల్లం.. అయితే ఈ బెల్లం మొత్తం పైన తెలిపిన ఐదుగురు సరఫరా చేస్తున్నారని తెలిసింది. తిరుత్తణి, కనకమ్మసత్రం నుంచి ఎన్ఎన్‌కండ్రిగ, శివాడ మీదుగా విజయపురం చేరుతున్నాయి. రాత్రి పూట మినీ వ్యాన్ ద్వారా తయారుదారులకు ఇంటికి నేరుగా అందిస్తున్నారని, అయినా అధికారుల అండదండతోనే బెల్లం సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు విని పిస్తున్నాయి.

ప్రాణాలతో చెలగాటం

సారా తయారీదారులు మందుబాబుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాటు సారా వల్ల లివర్ తొందరగా పాడైపోతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయినా పోతే ప్రజల ప్రాణాలే కదా మాకు వచ్చేవి వస్తున్నాయి కదా.. అన్న ధోరణిలో అటు తయారీదారులు.. ఇటు అధికారులు ఉన్నారు. సారా తయారీకి అలవాటు పడిన కుటుంబాలు ఇంకోపని చేయడానికి ఇష్టపడటంలేదు. ఒకరోజు కష్టపడి నాటుసారా తయారు చేస్తే నెలకు సరిపడా సంపాదించుకోవచ్చని సారా వైపే మొగ్గుచూపుతున్నారు. పలు గ్రామాల్లో సారా తయారీ యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు నామమాత్రపు దాడులకే పరిమితమవుతున్నారు. ఒకవేళ ఎక్కడైనా తయారీదారులు, అమ్మకం దారులను పట్టుకున్నా నామమాత్రపు కేసులతో సరిపెడుతున్నారు. ఒకరిద్దరిపై మిగిలిన వారు యథాప్రకారం సారా కాస్తున్నారు. పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చినా మళ్లీ అదే వృత్తిని కొనసాగిస్తున్నారు.

వాగులు, వంకలే స్థావరాలు

విజయపురం మండలంలో వాగు, వంక ప్రాంతం నాటుసారా తయారీ కేంద్రాలకు స్థావరంగా మారింది. మండలాల పరిధిలోని విజయపురం, కేవీపురం, కలియంబాకం గ్రామాల్లో నాటుసారా గుప్పుమంటోంది. ఈ గ్రామ సమీపమంతా అటవీ ప్రాంతం, వాగులు, వంక కావడంతో పెద్దఎత్తున నాటు సారా తయారు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నాటుసారా తయారీ దారులకు, అమ్మకం దారులకు అధికార పార్టీ నేతల అండ పుష్కలంగా ఉండటంతో పోలీసులు పట్టుకున్నా నామమాత్రపు కేసులతో ఒకరిద్దరిపై నెట్టేసి మిగిలిన వారు యథాప్రకారం సారా కాస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

బాటిళ్లలో విక్రయం

నాటుసారా గతంలో ప్యాకెట్లలో ఉత్పత్తి చేసేవారు. అయితే రవాణా కష్టంగా ఉందని తయారీదారులు రూటుమార్చి కొత్త తరహాలో వాటర్ బాటిల్లో నింపేసి గుట్టుగా తరలించేస్తున్నారు. సారాను లీటర్, అర లీటర్ బాటిళ్లలో తరలిస్తున్నారు. పెద్దమొత్తంలో ఆర్డర్లు వచ్చినప్పుడు సారాను 20 లీటర్ల వాటర్ క్యాన్లలో నింపి గుట్టుగా రావాణా చేస్తున్నారు. ఇలా వేలాది లీటర్ల నాటుసారా మండలంలో ఎక్కడకి కావాలంటే అక్కడకు తరలిపోతోంది.

న్యూ టెక్నాలజీతో సారా తయారీ

గతంలో ఊరి వెలుపల తోపుల్లో, పొలాల్లో రహస్యంగా కాపు సారా కాసేవారు. ఇందుకు కుండలు, కట్టెలను వినియోగించేవారు. పాత విధానాలకు స్వస్తి చెప్పి సాంకేతికతను వినియోగిస్తున్నారు. కట్టెలకు బదులు గ్యాస్ సిలిండర్‌ను, మట్టి కుండల స్థానంలో మెటల్ పాత్రలను వినియోగిస్తున్నారు. గ్యాస్ వినియోగించడంతో తక్కువ సమయంలో, ఎక్కువ మొత్తంలో ఉత్పత్తి చేస్తున్నారు. ఏదైనా శుభ, అశుభకార్యక్రమం ఉందంటే తయారీదారులకు పండుగే.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి: డిఎంఅండ్‌హెచ్ఒ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ : వాతావరణ మార్పుల కారణంగా వచ్చే సీజన్ వ్యాధుల నుండి మనల్ని రక్షించుకునేందుకు కొన్ని ఆరోగ్య సూత్రాలను పాటిస్తే మనల్ని మనం కాపాడుకోవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతిదేవి ఆదివారం తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సీజనల్ వ్యాధులపట్ల ప్రజలల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్య చిక్కాలు ఇవే.....

ప్రతి ఒక్కరూ తాగునీటిని కాచి వడపోసి చల్లారిన తర్వాత మాత్రమే తాగాలి. ప్రతిరోజూ ఇంట్లో ఎప్పటికప్పుడు తయారు చేసిన ఆహారం తినాలి. వండిన ఆహారంపై శుభ్రమైన మూతాలు వుంచాలి. మీ ఇంట్లో దోమలు కానీ , ఈగలు కానీ మరి ఏ క్రిమి కీటకాలు లేకుండా ఇంటిని శుభ్రంగా ఉంచుకోవాలి. వంట చేసేందుకు ముందు, భోజనం చేసేందుకు ముందు, మల విసర్జనకు వెళ్లి వచ్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి. ప్రతి ఒక్కరూ బయట ప్రదేశంలో వండిన వంటలను, చిరు తిండిని (జంక్ ఫుడ్)ను తినేందుకు వీలైనంతవరకు దూరంగా ఉండేందుకు ప్రయత్నించాలి. ప్రతి దినం ఇంట్లోని వారందరూ శుభ్రంగా స్నానం చేసి ఉతికిన దుస్తులను ధరించాలి, ప్రతి రోజూ విడిచిన దుస్తులను శుభ్రంగా ఉతికి బాగా ఆరిన తర్వాత వాటిని ధరించాలి. మీ ఇంట్లో వృద్ధులు, చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలు వుంటే చల్లటి గాలిలో, వర్షంలో తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వారు అనారోగ్యానికి గురి కాకుండా చూసుకోవాలి. ఇంటి పరిసరాలను ఎలాంటి చెత్త చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి చుట్టుపక్కల నీరు నిల్వ ఉంటే ఆ నీటి గుంటలను మట్టితో కప్పి వేయాలి. లేకుంటే వాటిని మరమ్మతులకు గ్రామ కార్యదర్శి, సర్పంచ్, సంబంధిత వార్డు మెంబర్లకు తెలిపి నీటి గుంటలు లేకుండా చేసుకోవాలి. ఇంట్లో, మీ పరిసరాల్లో , పాత టైర్లలో , టెంకాయ చిప్పల్లో , పాత వాటరు బాటిల్స్‌లో లేక పాత రోళ్లు, ఇతర ఏ సామగ్రి లోనైనా నీరు నిలువ ఉండకుండా చూసుకో వాలన్నారు. ఒకవేళ నీరు వుంటే వాటిని వెంటనే తొలగించి ఆ పాత్రను, వ్యర్థ పదార్థాలు ఎప్పటి కప్పుడు తొలగించాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖ వారు ప్రతి శుక్రవారం తలపెట్టిన ఫ్రైడే డ్రైడేలో మీరు ఆరోగ్యశాఖ అందించిన సూచనలు, సలహాలను తప్పక పాటించాలన్నారు. దోమల నివారణకు మీ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. వ్యక్తిగత పరిరక్షణకు మీ ఇంటి వద్ద లభించే వేపాకుతో పొగ వేసు కునేందుకు దోమ కాటుకు గురికాకుండా రక్షణ పొందా లన్నారు. మీరు రాత్రి పూట పడుకు నేటప్పుడు పూర్తి శరీర రక్షణకు ఫుల్ హాండ్స్ కలిగిన దుస్తులు ధరించాలన్నారు. మీ ఇంట్లో చుట్టుపక్కల వారికి ఎవరికైనా జ్వరం, వాంతులు, విరోచనాలు , ఏ ఇతర సమస్య వచ్చినా వెంటనే స్థానిక ఆశా కార్యకర్తకు, ఏఎన్ఎంలకు, ఎంఎల్ హెచ్ పికి వెంటనే తప్పకుండా సమాచారం అందిం చాలన్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్య ఉన్నా దగ్గరలోని పీహెచ్‌సి, యుహెచ్‌సి లేక ఇతర ప్రభుత్వ వైద్యశాలలో కాని సమాచారం ఇచ్చి మీ ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు.

సూచనలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రభావతిదేవి

ఘనంగా ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్ :

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ చిత్తూరు రీజియన్ 6వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం స్థానిక ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ చిత్తూరు రీజియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెవిఎస్ఎన్ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ పటిష్టత కోసం చేపట్టాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అంతకు ముందు కేక్ కట్ చేసి ఉద్యోగులు, సిబ్బందికి పంచిపెట్టారు. అనంతరం కెవిఎస్ఎన్ మూర్తి మీడియాతో మాట్లాడుతూ తమ యూనియన్ ఏర్పడి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 6 వ వార్షికోత్సవాన్ని చిత్తూరులో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటి వరకు తమ సంఘం ఐకమత్యంతో కొనసాగిందని, ఇక పై కూడా అదే తరహాలో పయనిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ వివి ప్రసాద్, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ కే గిరిధర్, రీజనల్ సెక్రటరీ ఏకే శ్రీహరితో పాటు పెద్ద ఎత్తున బ్యాంకు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ చిత్తూరు రీజియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెవిఎస్ఎన్ మూర్తి

కూలీలకు పని కల్పించడమే ఎన్ఆర్ఈజీఎస్ లక్ష్యం

ఎన్ రాజశేఖర్ , జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: వ్యవసాయ అభివృద్ధి, నీటి నిల్వల పెంపు ఉపాధి పథకంలో జాబ్ కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించే లక్ష్యంతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ పని చేస్తోందని, ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న డ్వామా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పని చేస్తున్నారని గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో నిర్దేశించిన అంశాల మేరకు ఉద్యానవనాల పెంపు, నీటి నిల్వలు పెంచేలా కుంటల తవ్వకాలు, స్కీల్, పాడి ఆవులు, కోళ్ల పెంపకం షెడ్ల నిర్మాణం, ఉద్యాన వనాల అభివృద్ధి కోసం ఉద్యాన రైతులకు తోడ్పాటును అందిస్తున్నామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి రాజశేఖర్ తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో జిల్లాలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) అమలు చేస్తున్న కార్యక్రమాలకు సంబంధించి పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు.

ప్రజాశక్తి: డ్వామా లక్ష్యం ఏమిటి?

డ్వామా పీడీ: జిల్లాలో నీటి వనరులు పెంచడంతో పాటు ఉద్యావన వనాల అభివృద్ధి, ఉపాధిహామీ కూలీలను జాతీయ ఉపాధి హామీ చట్టం ప్రకారం జాబ్‌కార్డులు కలిగిన ప్రతి ఒక్కరికీ పని దినాలు కల్పించి పని ప్రదేశాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పన, సకాలంలో కూలీలు అందేలా చర్యలు తీసుకుంటున్నాం..

ప్రజాశక్తి: ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఎంత మంది జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు?

డ్వామా పీడీ: ఎన్ఆర్ఈజీఎస్‌లో జాబ్‌కార్డులు పొందిన వారు 2,55,153 ఉన్నారు. వీరిలో ప్రస్తుతానికి పనులకు హాజరవుతున్నవారు 1,55,632 ఉన్నారు. ఉపాధి హామీ కూలీలను ఈ ఏడాది రూ.12,764.17 లక్షలు చెల్లింపులు జరిగాయి.

ప్రజాశక్తి: గ్రామ సభల్లో గుర్తించి పనులు ఎన్ని?

డ్వామా పీడీ: జిల్లాలో రూ. 91.30 కోట్లతో 1407 పనులకు గ్రామ సభల్లో ఆమోదం పొందాయి. దీంతో పాటు ఉపాధి హామీ కింద గుర్తించిన పనులను ప్రభుత్వానికి పంపాం..

ప్రజాశక్తి: గ్రామ సభల్లో ఏఏ సమస్యలపై చర్చించారు..?

డ్వామా పీడీ: గ్రామ సభలలో భాగంగా మరుగుదొడ్లు, విద్యుత్, కుళాయి, వంటగ్యాస్ కనెక్షన్లు, మురుగునీరు-ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, సిమెంటు రహదారులు, గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, మండల కేంద్రాలకు లింక్ రోడ్లు, ఇంకుడు గుంతలు, పంట కుంటల నిర్మాణం. ఉద్యానవన, పట్టు పరిశ్రమ అభివద్ధికి సదుపాయాలు, పశువుల పెంపకం, షెడ్ల నిర్మాణానికి సహకారం వంటి సమస్యలతో పాటు స్థానిక ప్రజల ఇతర సమస్యలను చర్చించాము.

ప్రజాశక్తి: ఉపాధి హామీ కూలీలకు కల్పించిన పనిదినాలు, వేతన చెల్లింపులు ఎంత..?

డ్వామా పీడీ: 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా 3.06 లక్షల కుటుంబాలకు 173.73 లక్షల పని దినాలు కల్పించి 446.12 కోట్లు వేతన రూపంలో చెల్లించాం. 2024-25 ఆర్థిక సంవత్సరంలో అంటే ఇప్పటి వరకు 1.79 లక్షల కుటుంబాలకు 55.70 లక్షల పని దినాలు కల్పించి 146.07 కోట్లు వేతన రూపంలో చెల్లింపులు చెల్లించాం..

ప్రజాశక్తి: వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు ఎన్ని....?

డ్వామా పీడీ: ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో వంద రోజులు పని దినాలు పూర్తి చేసుకున్న కుటుంబాలు 2,271 ఉన్నాయి. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నాం. పని ప్రదేశాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నాం..

ఎన్ రాజశేఖర్ , జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా)పీడీ.

నేడు కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం చిత్తూరు కలెక్టరేట్ లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం) కార్యక్రమును ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు నియోజక వర్గ, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజకవర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

పారిశుధ్యాన్ని మెరుగు పరచాలి

అపరిశుభ్రంగా మారిన వీధులు

ప్రజాశక్తి - తవణంపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య లోపం కారణంగా చిన్న పిల్లలు, వృద్ధులు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల బారిన పడి భయాందోళనకు గురవు తున్నారని వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మండల అధికారులు స్పందించి వ్యాధుల నివారణకు అవగాహన కల్పించి పారిశుధ్యాన్ని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు వైఎస్ఆర్ వర్ధంతి

ప్రజాశక్తి -వెదురుకుప్పం : మాజీ ముఖ్యమంత్రి వైయస్‌రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు సోమవా రం నిర్వహిస్తామని ఆ పార్టీ మండలం అధ్యక్షులు కామసాని పద్మనాభరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం ఉదయం వెదురుకుప్పం మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులు అర్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు స్థానికులు హాజరు కావాలని కోరారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి -శాంతిపురం: మండల పరిధిలోని శివరాంపురంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఆదివారం ముగిశాయి. హిందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చేపట్టిన ఈ వేడుకల్లో చివరి రోజు శ్రీకృష్ణ విగ్రహాన్ని ఊరేగించారు. ఈ కార్య క్రమంలో హిందూ జ్ఞాన వేదిక శివరాంపురం కమిటీ అధ్యక్షుడు, సభ్యులు కృష్ణమూర్తి, రంగప్ప, బాలాజీ, దివాకర్, గోవిందప్ప, మల్లప్ప, దిలీప్, బుచ్చప్ప, సుకన్య, రాణెమ్మ, రాజేశ్వరీ ,విమలమ్మ, వసంత , రామక్క, శశికళ, ముద్దక్క పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షా శిబిరం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని ఇందిరానగర్ కాలనీలో ఆదివారం ఎంఎన్ హాస్పిటల్ చెన్నై వారిచే సిఎస్ఐ పాల్ , చర్చి పాస్టర్ సురేష్ సహకారంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. చెన్నై ఎం .ఎన్ హాస్పిటల్ చేపట్టిన శిబిరానికి 200 మంది రోగులు హాజరు కాగా వారికి కంటి పరీక్షలు చేయగా, 50 మందికి కంటి ఆపరేషన్ కు ఎంపికైనట్లు క్యాంపు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు అబ్బాస్ , అఖిల్ అబ్బాస్ , వైసీపీ నేత కుట్టి, చర్చి సభ్యులు గుణశేఖర్, పలువురు రోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

డిప్యూటీ సిఎంకు ఎంపి శుభాకాంక్షలు

పవన్ కళ్యాణ్‌తో ఎంపి దుగ్గమల్ల ప్రసాద్‌రావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు చిత్తూరు ఎంపి దుగ్గమల్ల ప్రసాద్ రావు ఆదివారం ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవ కోసం రాజకీయాల్లోకి వచ్చి జనసేన ని స్థాపించి 10 సంవత్సరాల పాటు ప్రజలతో మమేకమైన పవన్ కళ్యాణ్ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని, ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. సక్సెస్ అందుకున్న పవన్ కళ్యాణ్ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరిన్ని జరుపుకోవాలని ఆకాంక్షించారు.

బైరెడ్డిపల్లి: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి సోమవారం జన్మదిన కావడంతో మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి సమీపాన మండల జనసేన అధినేత పసుపులేటి దిలీప్ ఆధ్వర్యంలో భారీ కటౌట్ ఏర్పాటుచేసి భారీ కేకును కట్ చేయనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమానికి మండలంలోని జనసేన నాయకులు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

కంటి చికిత్స శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి -పలమనేరు: చిత్తూరు జిల్లా పలమనేరు మున్సిపాలిటీ ఆర్టీసీ బస్టాండ్ పక్కన వున్న రిక్రియేషన్ క్లబ్‌లో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ, మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది.దాదాపు 90 మంది హాజరయ్యారు. ఇందులో కంటి శస్త్ర చికిత్స కోసం 50 మంది ఎంపికయ్యారు. వారికి చెన్నై శంకర నేత్రాలయ హాస్పిటల్‌లో బుధవారం కంటి శస్త చికిత్సలు చేయనున్నారు. వీరందరికి ఉచిత ప్రయాణం , భోజనం, వసతి, మందులు అందించనున్నారు. శిబిరం సందర్భంగా మధ్యాహ్న భోజనం ,తాగునీరు పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలకు ఎంపికైన వారికి ,వారి సహాయకులకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో శంకర నేత్రాలయ డా, వినోద్ , మురళి క్రిష్ణ, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

బైరెడ్డి పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణంలో ఆదివారం ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మహతి ఫౌండేషన్, బైరెడ్డిపల్లి వారి సహకరంతో పి ఇ ఎస్ ఆసుపత్రి ,కుప్పం వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు.ఈ శిబిరానికి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా డాక్టర్ లిఖిత మాట్లాడుతూ సుమారు 90 మంది వరకు రోగులు హాజరయ్యారని వారికి కంటికి సంబంధించిన చికిత్సలు నిర్వహించి, వీరిలో లోపం వున్న వ్యక్తులను ఉచిత కంటి ఆపరేషన్ నిమిత్తం 10 మందిని ఎంపిక చేశామని తెలిపారు.

కాణిపాక బ్రహ్మోత్సవాలకు అమర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి -పలమనేరు: పూతలపట్టు నియోజకవర్గం లోని ప్రముఖ పుణ్యక్షేత్రం స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు రావాలని పలమనేరు శాసనసభ్యులు అమరనాథ రెడ్డిని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఆ మేరకు పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, ఆలయ ఈవో గురుప్రసాద్ ఆదివారం వారి స్వగృహానికి విచ్చేసి ఆహ్వాన పత్రికను అందించారు. ఈ నెల 7 నుంచి 27 వరకు జరగనున్న కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆహ్వాన పత్రికను అమరనాథ రెడ్డి దంపతులకు అందించి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం టీడీపీ మండల అధ్యక్షులు దొరబాబు చౌదరి, కాణిపాక ఆలయ మాజీ ఛైర్మన్ మణి నాయుడు, మాజీ సర్పంచ్ మధు, పట్నం గోపి యాదవ్, యాదమరి సుభాష్ నాయుడు ఉన్నారు.

రేపటి నుండి 'పొలంబడి పిలుస్తోంది'

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి : రైతులకు క్షేత్రస్థాయిలో పొలంబడికి అందుబాటులో వ్యవసాయ అనుబంధ శాఖలుఈనెల మూడోవ తేది నుండి వారంలో 2 రోజులు పొలం బడి పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం కు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హాజరవుతారు. రైతులకు ప్రస్తుతం అమలవుతున్న పథకాలు ,సాంకేతిక అంశాలు వివరిస్తూ క్షేత్ర స్థాయి లో సమస్యలను గుర్తించి సూచనలు అందించనున్నారు. రైతులు ఈ కార్యక్రమలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి గీతా కుమారి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

యాదవ ఎంప్లాయీస్ సొసైటీ మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:

ఎస్ఆర్ పురం మండల యాదవ ఎంప్లాయీస్ సొసైటీ నూతన కార్యవర్గాన్ని ఆ సొసైటీ నియోజకవర్గం అధ్యక్షుడు యజోగి గురుమూర్తి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా కృష్ణయ్య యాదవ్, అధ్యక్షులుగా రాజేంద్ర యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బాబు యాదవ్,ఆర్థిక కార్యదర్శిగా పాపయ్య యాదవ్, మహిళా కార్యదర్శిగా సునీత యాదవ్, కార్యదర్శులుగా రఘు,పృథ్వీరాజ్, నరసింహులు, ఢిల్లీ, త్రివేణ్ కుమార్ హేమరాజ్ ,శ్యామల భాస్కర్ ,పార్థు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా, నియోజకవర్గ యాదవ నాయకులు కుప్పు స్వామి యాదవ్, ఎన్నార్ యాదవ్ ,కోదండ యాదవ్ ,ఢిల్లీ ప్రకాష్ యాదవ్, దేవరాజు యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

వర్షాలకు అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: అల్పపీడన ప్రభావం చిత్తూరు జిల్లా మీద కూడా తీవ్రస్థాయిలో ఉందని ముందు జాగ్రత్త చర్యగా కలెక్టర్ విద్యా సంస్థలకు సెలవు ప్రకటించడం అభినందనీయమని అయితే భారీగా వర్షాలు పడే మండలాల్లో అధికార యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నింద్ర ,నగిరి ,కార్వేటినగరం, పలమనేరు లాంటి ప్రాంతాల్లో వర్షాలు తీవ్రస్థాయిలో పడే అవకాశం ఉంది. ఆయా మండలాల్లో అధికారులు అందుబాటులో వుండి ముందు జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండి ప్రజలకు సరైన సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. వర్షాల వలన మునిగిన వాళ్ళు, పిల్లలు అనారోగ్యానికి గురవుతున్నారని వారికి వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వర్షం తీవ్రతను ఎప్పటికప్పుడు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయికి తెలియజేస్తూ జిల్లా కేంద్రంలో టీమును ఏర్పాటు చేయాలన్నారు. వర్షాల బారిన పడి నష్టపోయిన వారికి వెంటనే సహాయం చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

పాత పెన్షన్ విధానం ఆమోదయోగ్యం

కలెక్టరేట్ ఎదుట నిరసన

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ తప్ప, ఏ విధానాన్ని తమ పైన రుద్దడానికి ప్రయత్నించొద్దని ఎస్‌టియు చిత్తూరు జిల్లా శాఖ డిమాండ్ చేసింది. ఎస్‌టియు రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు ఆ సంఘం చిత్తూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మదన్మోహన్ రెడ్డి, బోడె మోహన్ యాదవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సిపిఎస్ విధానానికి , యుపిఎస్ అనే ముసుగు వేసి అమలు చేయాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఉద్యోగుల జీవన భద్రతకు గొడ్డలపెట్టులా మారిన నూతన పెన్షన్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని భేషరతుగా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు . పెన్షన్ పొందడం భిక్ష కాదని, ఉద్యోగి హక్కని సుప్రీంకోర్టు విస్పష్టంగా పేర్కొన్నప్పటికీ తద్విరుద్ధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లు కూడా పదవిలో ఉండని రాజకీయ నాయకులకు పెన్షన్ ఇచ్చేటప్పుడు, మూడు నాలుగు దశాబ్దాలు ఉద్యోగం చేసిన వారికి గౌరవప్రదమైన పెన్షన్ లేదనడం దారుణమని విమర్శించారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు ఉద్యమాలు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు.

చిత్తూరు అర్బన్: ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల జీవితాల్లో ఆందోళన నింపే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) ను వెంటనే రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ ఎంపాయీస్ అసోసియేషన్ (సిపిఎస్ ఈఏ) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్త పెన్షన్ విధానం (సిపిఎస్) రద్దుచేసి, దాని స్థానంలో తిరిగి పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) ను అమలు చేయాలంటే డిమాండ్ చేస్తూ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులు ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. తొలుత సిపిఎస్ ఉద్యోగులందరూ కొన్ని నల్లటి రంగు రిబ్బన్లను తమ తలలకు ధరించి, మరికొన్ని నల్ల రంగు రిబ్బన్లను ఆకాశంలోకి ఎగరవేసి సెప్టెంబర్ 1 వ తేదీని బ్లాక్ డే గా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ సిపిఎస్ ఈఏ జిల్లా అధ్యక్షులు సమీర్ మాట్లాడుతూ 2004 వ సంవత్సరం అనంతరం ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని రద్దుచేసి దాని స్థానంలో సిపిఎస్ విధానాన్ని అమలు చేసేలా సెప్టెంబర్ 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీపీఎస్ ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు అసోసియేట్ అధ్యక్షులు అమర్ ఉపాధ్యక్షులు లోకేష్ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సుభాలక్ష్మితో పాటు పెద్ద ఎత్తున సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్‌టియు నాయకులు

హెచ్ఐవిపై అవగాహన యూత్ ఫెస్ట్ మారథాన్

ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టరు ప్రభావతి దేవి ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ సంయుక్త ఆధ్వర్యంలో "యూత్ ఫెస్ట్ మారథాన్ ఆన్ హెచ్ఐవి , ఎయిడ్స్' కార్యక్రమాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం చిత్తూరు మెకానికల్ గ్రౌండ్ నుంచి పీవీకేన్ కాలేజ్ వరకు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి రెండవ ప్రైజులు మగ, ఆడ , ట్రాన్స్ జెండర్ మూడు విధాలుగా రూ.7వేలు, రూ.4వేలు అందించారు. దీని ప్రధాన ఉద్దేశం యువత హెచ్ఐవి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన ఇతరులకు తెలపాలన్నారు. హెచ్ఐవి 'హ్యూమన్ ఇమినో డెఫిషియన్సీ వైరస్ ద్వారా వస్తుంది. హెచ్ఐవి వ్యాధి నాలుగు రకాలు ద్వారా వ్యాపిస్తుందని, విచ్చలవిడి లైంగిక సంబంధాల ద్వారా, హెచ్ఐవి ఉన్న రక్తాన్ని ఎక్కించుకోవడం ద్వారా, ఒకే సూదిని విచ్చలవిడిగా వాడటం ద్వారా, గర్భిణీల నుండి బిడ్డకు వ్యాపిస్తుందన్నారు. ప్రతి గర్భిణీ తప్పనిసరిగా హెచ్ఐవి పరీక్ష చేయించు కోవాలన్నారు. లైంగిక సమయంలో కండోమ్ వాడాలని, హెచ్ఐవి సోకిన వ్యక్తులు విపరీతంగా బరువు తగ్గిపోయి వ్యాధి నిరోధకత తగ్గి అన్ని రకాల వ్యాధులు వస్తాయ న్నారు. హెచ్ఐవి వ్యాధి గ్రస్తులకు ఏఆర్‌టి సెంటర్ ద్వారా ఉచితంగా జీవితాంతం మందులు పంపిణీ చేస్తారన్నారు. ఈ మందులు వాడు తూ మంచి పౌష్టికాహారం తీసు కుంటే జీవితాంతం ఆరోగ్యంగా ఉండొచ్చని ఎవరికైనా ఏమాత్రం డౌట్ వచ్చినా వీసీటీసీ సెంటర్ వద్ద ఉచితంగా రక్త పరీక్ష చేయించుకుని అనుమానాన్ని నివృత్తి చేసుకోవాలని కోరారు. ఈ విషయాలపై యువత పెడదోవ బారిన పడకుండా పాటిస్తూ, ప్రజలందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేశవ నాయుడు , డాక్టర్ శిరీష,శ్రీవాణి, రామ్మోహన్, స్పోర్ట్స్ అథారిటీ బాలాజీ, పిఈటీలు, స్టాఫ్ పాల్గొన్నారు.

పోటీల విజేతలకు బహుమతులు అందిస్తున్న జిల్లా వైద్యాధికారి ప్రభావతి దేవి

బ్రాహ్మణ సంఘం అభ్యున్నతికి కృషి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గంగవరం: బ్రాహ్మణ సంఘం అభ్యున్నతికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. గంగవరం మండలం కీళ్లపట్ల పంచాయతీ శ్రీ గాయత్రి బ్రాహ్మణ సంఘం 10వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తొలుత కోనేటిరాయ స్వామిని ఎమ్మెల్యే స్థానిక టిడిపి నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం కీళ్లపట్ల గ్రామంలోని అన్నం సొసైటీ కళ్యాణ మండపంలో వార్షికోత్సవ కార్యక్రమానికి వారు హాజరు కాగా బ్రాహ్మణ సంఘం నాయకులు వారికి ఘన స్వాగతం తెలిపారు. బ్రాహ్మణుల సమస్యలు, ఆలయాలలో ధూపదీప నైవేద్యాలతో పాటు అర్చకులకు అందుతున్న గౌరవ వేతనం తదితర అంశాలపై సంఘ సభ్యులు ఎమ్మెల్యేకు వివరించి పలు సమస్యలను ఆయనకు విన్నవించారు. అనంతరం మాట్లాడిన ఆయన... బ్రాహ్మణ సంక్షేమానికితన వంతు కృషి చేస్తానని, బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా వారిని ఆదుకోవాలనే ఆలోచన చేసింది టిడిపి ప్రభుత్వమే అన్నా రు. స్థానికంగా బ్రాహ్మణ సంఘ సభ్యులకు తలెత్తే సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడు సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. అనంతరం బ్రాహ్మణ సంఘ అభ్యున్నతికి తోడ్పడి విశేష సేవలు అందించిన బ్రాహ్మణ పెద్దలను ఎమ్మెల్యే సన్మానించారు. అన్నం సొసైటీ కళ్యాణ మండపానికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే దుశ్శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నాయకులు కిషోర్, చంద్రమౌళి, వైకే రెడ్డెప్పలతో పాటు స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్, టిడిపి నాయకులు సోమశేఖర్ గౌడు, ప్రతాపరెడ్డి, ప్రసాద్ నాయుడు, వేణు, రాము, రవిలతో పాటు పట్టణ నాయకులు కుట్టి, గిరిబాబు, మదన్, శ్రీధర్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం వార్షికోత్సవ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

నైతిక విలువల విద్యా విధానం అమలు చేయాలి

ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షులు హృదయరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నైతిక విలువలతో కూడిన విద్యా విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీపీఎఫ్) 1938 రాష్ట్ర అధ్యక్షులు, ఏపీ జేఏసీ సెక్రటరీ జనరల్ హృదయరాజు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ 1938 ఏర్పడి 80 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని చిత్తూరు నగరం కట్టమంచి శాంతారఘురామన్ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు 20 వ జిల్లా విద్య వైజ్ఞానిక మహా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష హృదయరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ చిరంజీవి హాజరయ్యారు. ఏపీటీఎఫ్ 1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం కిరణ్ కుమార్, కే చిట్టిబాబు ఆధ్వర్యంలో మహా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఏపీటీఎఫ్ 1938 ఆవిర్భావం నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ జాతీయ విద్యా విధానాలను అమలు చేస్తూ విద్యను నీరుగార్చే ప్రయత్నాలు చేస్తుండడం దారుణం అన్నారు. ఇప్పటికి లక్ష మందికి పైగా పిల్లలు బడి బయట ఉన్నారని, వారిని బడిలోకి చేర్చే ప్రయత్నాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేయకపోవడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎంఈఓ ఏ సెల్వరాజ్, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు నాదముని, రాష్ట్ర ఆదనపు కార్యదర్శి చెంగల్రాయమందడి, జిల్లా గౌరవ అధ్యక్షులు వరదరాజులు నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు అమరనాథరెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు గిరిబాబు, జిల్లా అదనపు కార్యదర్శి షమీర్, జిల్లా కార్యదర్శులు ఉదయ్ కుమార్, లత, శివరంజని, రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు, అధిక సంఖ్యలో ఏపీటీఎఫ్ 1938 సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

బాలయ్య 50 సంవత్సరాలు స్వర్ణోత్సవలు సంబరాలు

ప్రజాశక్తి -పుంగనూరు : పుంగనూరు పట్టణం ఎన్టీఆర్ సర్కిల్లో నందమూరి బాలకృష్ణ 50 సంవత్సరాల సినీ ప్రస్థానం పూర్తయిన సందర్భంగా చిత్తూరు జిల్లా టిడిపి సాంస్కృతిక విభాగంలో కార్యదర్శి అప్పిరెడ్డి ఆధ్వర్యంలో అభిమానులు ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం నిర్వహించారు. అభిమానుల మధ్య కేక్ ను కట్ చేసి అందరూ సంబరాలు జరుపుకున్నారు. టిడిపి నాయకుడు మోహన్ రెడ్డి అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రుల ఆరాధ్య దైవం నందమూరి తారకరామారావు ముద్దుబిడ్డ మా బాలయ్య తన సినీ ప్రస్థానంలో 50 వసంతాలు పూర్తి చేసుకోవడం ఈరోజు స్వర్ణోత్సవ సంబరం జరుపుకోవడం అభినందనీయం అన్నారు. పుంగనూరులో అభిమానుల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ శుభ సందర్భంగా ప్రతి గురువారం రెండు రూపాయలకే వైద్య సేవలను పల్లె పల్లెలో అందివ్వడానికి వాహనాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, టిడిపి నాయకులు సివిరెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు



క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి -పుంగనూరు : పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని బెంగళూరు నుంచి పుంగనూరుకు వచ్చిన ఓ యువకుడు శనివారం అర్ధరాత్రి పట్టణంలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. పట్టణంలోని ఎన్ఎస్ పేటకు చెందిన నారాయణ కుమారుడు వేణు ప్రసాద్(20) బెంగళూరులో పనిచేస్తున్నాడు. ఆదివారం పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలని బెంగళూరు నుండి పుంగనూరుకు వచ్చాడు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ప్రమాదం ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? అనే వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి వుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - రామకుప్పం: మండల పరిధిలోని పులు మడుగు తాండ గ్రామ శివారు లో ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలు అయిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. తండాకి చెందిన బీరప్ప(28) గ్రామం నుంచి పల్లి కుప్పం వైపు వస్తుండగా ఎదురుగా ద్విచక్ర వాహనంలో వస్తున్న చాంప్లా నాయక్(55) ను ఢీకొన్నారు. చాంప్లా నాయక్ కుడికాలు విరిగింది. బీరప్పకు గాయాలు కావడంతో ఇద్దరిని 108 ద్వారా కుప్పం ఆస్పత్రికి తరలించారు.

గాయపడిన వ్యక్తిని తీసుకెళుతున్న 108 సిబ్బంది

ఎనిమిది మందికి జరిమానా

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:

ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్య బాబు శనివారం నిర్వహించిన వాహన తనిఖీలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఎనిమిది మంది పట్టుబడ్డారు. వీరిని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో శనివారం ఉదయం ప్రవేశపెట్టగా జడ్జి ఉమాదేవి వాహనదారులకు ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున మొత్తం 80 వేల రూపాయల ఫైన్ విధించారు. 9 నెలల వ్యవధిలో చిత్తూరు ట్రాఫిక్ పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపిన 290 మందికి సుమారు 22.8 లక్షల రూపాయల ఫైన్ విధించారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, జిల్లా లోని ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలను తప్పక పాటించాలని లేదా భారీ జరిమానాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

యువకుడికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -వెదురుకుప్పం :

గుర్తు తెలియని వాహనం ఢీకొని వెదురుకుప్పం మండలం లోని మాంభేడు పంచాయతీ ధర్మా చెరువు గ్రామానికి చెందిన యువకుడు ఎం భూపాల్ (34) తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదం ఆదివారం సాయంత్రం ధర్మా చెరువు రోడ్డు వద్ద చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో యువకుడు భూపాల్ కు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108వాహనంలో తిరుపతికి హాస్పిటల్ కు తరలించారు. గుర్తు తెలియని వాహనం ఢీకొని అతివేగంగా ప్రమాదం జరిగిన స్థలం లో నిలపకుండా పచ్చికాపలం వైపు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసులు స్పందించి గుర్తు తెలియని వాహనాన్ని పట్టుకొని ప్రమాదంలో గాయపడిన యువకుడు భూపాల్ కు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

.కుప్పం రెవెన్యూ డివిజన్లో 30 పోలీసు యాక్ట్ అమలు

ప్రజాశక్తి -కుప్పం టౌన్ : కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలో 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నట్టు డి.ఎస్.పి పార్ధసారథి ఆదివారం పత్రికా ప్రకటనలో తెలిపారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సెప్టెంబర్ 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నామన్నారు. కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలోని కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల పరిధిలో ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి నిర్వహించకూడదని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

పాల్గొన్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

రాష్ట్రాభివృద్ధికి కృషి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇద్దరూ అహర్నిశలూ శ్రమిస్తూ ముందుకు వెళుతున్నారని వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలిగించకూడదని టిడిపి కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం కర్ణాటక రాష్ట్రం కె.ఆర్ పురంలో బెంగుళూరు టిడిపి ఫోరం 11వ వార్షికోత్సవ (నవశకం) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కుప్పం టిడిపి నియోజకవర్గ సమన్వయ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ, రాష్ట్ర మంత్రి సవితమ్మ, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, శాసనసభ్యులు గురజాల జగన్మోహన్, శాసనసభ్యులు సురేంద్రబాబు, డాక్టర్ సురేష్ బాబు, చెన్నై టీడీపీ ఫోరమ్ చంద్ర, రావి మోహన్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ మాట్లాడుతూ నవశకం మంచి రోజులు వచ్చేశాయి కార్యక్రమానికి అవకాశం ఇచ్చిన బెంగళూరు టిడిపి ఫోరం సభ్యులకు కృతజ్ఞతలు... తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుని అత్యంత భారీ మెజారిటీతో గెలిపించి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసేందుకు యువత ఎంతగానో కష్టపడ్డారు అన్నారు. తెలుగుదేశం పార్టీలో యువతకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. బెంగళూరు ఫోరం సభ్యులు టిడిపి అధినేతపై ఎంతో అభిమానంతో ఎన్నికల సమయంలో ముందుకొచ్చి రాష్ట్రానికి విజనరీ నేతను ముఖ్యమంత్రి చేసుకునేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కుప్పంలో రానున్న రోజుల్లో నూతన తరాన్ని ఎంపిక చేసినందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. బెంగళూరు ఫోరం సభ్యులు ఎన్నికల సమయంలో ఒక కమిట్మెంట్ తో పని చేశారన్నారు. వైకాపా ఐదేళ్ల అరాచక పాలనతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, రానున్న రోజులు మంచి రోజులని తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమంకి పెద్దపీఠం వేస్తామన్నారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు లక్ష్యంగా అనేక పరిశ్రమలు తీసుకొస్తామన్నారు. రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవ్వగానే పారిశ్రామికవేత్తలు పరిశ్రమలో పెట్టేందుకు రాష్ట్రానికి వస్తున్నారని, అది కేవలం చంద్రబాబు బ్రాండ్ అన్నారు. ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలపాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వైసీపీ చేసే చౌకబారు విమర్శలకు కౌంటర్ ఇచ్చేందుకు యువత సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

చిత్తూరు అర్బన్: బెంగళూరు టిడిపి ఫోరం 11వ వార్షికోత్సవం సందర్భంగా బెంగళూరు నగరంలోని కెఆర్ పురం వద్ద వున్న ఎంటిబి కళ్యాణ మండపంలో నిర్వహించిన "నవశఖం – మంచిరోజులు వచ్చేశాయి" కార్యక్రమానికి హాజరైన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా బెంగళూరు టిడిపి ఫోరం పార్టీకి సంబంధించిన అనేక కార్యక్రమాలను సమర్ధవంతంగా నిర్వహించామన్నారు.

ప్రత్యేక ప్రతిభావంతుల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పట్టణంలో ఆశాజ్యోతి దివ్యాంగుల సేవ సంఘం కార్యాలయంలో ఆదివారం రమేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి జాతీయ మానవ హక్కులు, అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా అధ్యక్షులు డి.వి. మునిరత్నం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రతిభావంతుల హక్కుల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సకలాంగుల కంటే వికలాంగులకు ప్రత్యేకమైన చట్టాలు, హక్కులు రాజ్యాంగంలో పొందుపరిచారని వివరించారు. హక్కుల సారాంశాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని హక్కులను ప్రశ్నిస్తూ అభివృద్ధి వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. పోటీ సమాజంలో సకలాంగులతో సమానంగా వికలాంగులు పోటీపడి హైటెక్నాలజీతో ముందంజలో ఉన్నారని గుర్తు చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగుల కోసం అనేక సంక్షేమ సబ్సిడీ పథకాలు విడుదల చేస్తున్నప్పటికీ వాటిలో అతి తక్కువ మంది మాత్రమే లబ్ధి పొందుతున్నారని అలా కాకుండా ప్రభుత్వాలు ద్వారా విడుదలయ్యే పథకాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే ఐక్యమత్యం గా ఉండాలన్నారు. కొన్ని చోట్ల వికలాంగుల్లోనే దళారులు ఉన్నారని వారి మాయమాటల ను నమ్మి మోసపోకుండా మెలుకువలు పాటించాలన్నారు. దివ్యాంగులు అంగవైకల్యం కలిగి ఉంటారే తప్ప వారికి మంచి హృదయం, త్యాగం, ఆప్యాయత అనురాగాలు, పుష్కలంగా ఉంటుందని, వికలాంగత్వాన్ని మనసులో పెట్టుకోకుండా ధైర్యముతో జీవించాలన్నారు. భవిష్యత్తులో ఆశాజ్యోతి దివ్యాంగుల సంగం చేసే కార్యక్రమాలు, పోరాటాల్లో జాతీయ మానవ హక్కుల సంస్థ పాల్గొని వారి హక్కుల కోసం పోరాడుతామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు సుబ్బమ్మ, కోశాధికారి హరికృష్ణ, గోవిందు, సుజాత, పర్జాన్ బి, రామానాయుడు, ప్రత్యేక ప్రతిభావంతులు పాల్గొన్నారు